క్లుప్తంగా

17 నుంచి వర్కూరులో ఉరుసు



వర్కూరులోని సద్గురు ఖాజాహుసేన్ స్వామి దర్గా

కోడుమూరు రూరల్: వర్కూరులో వెలసిన సద్గురు ఖాజాహుసేన్ దాస్ 62వ ఉరుసు ఉత్సవాలు ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 17న గంధం, 18న ఉరుసు, 19న కిస్తీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా పీఠాధిపతి సద్గురు ఖాజా సుభహాన్ హుసేన్‌దాస్ శుక్రవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా దర్గాకు విచ్చేసిన భక్తులకు దాతలు భగవంతురెడ్డి కుమారులు, చెర్లోపల్లి గ్రామ శిష్యబృందం సభ్యుల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి పేర్కొన్నారు.

‘ఓర్వకల్లు దర్గాకు అల్లాషా ఖాద్రికి సంబంధం లేదు’

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులోని హజరత్ సయ్యద్ సుల్తాన్ అబ్దుల్ ఖాదర్ షా ఖాద్రి, హజరత్ గౌస్ మొహియ్యద్దీన్ షా ఖాద్రి దర్గాకు ఎస్ఎండీ మహబూబ్ అల్లాషా ఖాద్రి అనే వ్యక్తికి ఎలాంటి సంబంధం లేదని దర్గా పీఠాధిపతి నజురుల్లాషా ఖాద్రి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 3, 4, 5 తేదీల్లో దర్గా ఉరుసు నిర్వహించామని, మళ్లీ 14 నుంచి 16 వరకు ఉరుసు అంటూ అల్లాషా ఖాద్రి గురువారం ప్రకటించారన్నారు. దర్గాలో ఉరుసు నిర్వహించడం లేదని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

నేడు పోలకల్‌లో కంటి వైద్య శిబిరం

సి.బెళగల్: పోలకల్ గ్రామంలో శనివారం ప్రత్యేక కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణి, కంటి వైద్య నిపుణుడు సంపత్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. కర్నూలు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి పరీక్షలు చేస్తామన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు.

కార్ల్‌మార్క్స్‌కు నివాళి

కల్లూరు: శ్రమ దోపిడీని మొదటిసారి గుర్తించిన తత్వవేత్త కార్ల్‌మార్క్స్ అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ అన్నారు. శనివారం చెన్నమ్మ సర్కిల్‌లోని సూర్యనారాయణ భవన్‌లో కార్ల్‌మార్క్స్ వర్ధంతి సభను న్యూసిటీ కార్యదర్శి రాముడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజశేఖర్, అరుణ, నగేష్, సాయిబాబా, సుధాకరప్ప, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

గడివేముల: కొరప్రోలురు గ్రామానికి చెందిన షబ్బీర్‌కు చెందిన వరిగడ్డి వాము దగ్ధమైంది. పశువుల కోసం కల్లంలో నిలువ చేసుకున్న రూ.లక్ష విలువ చేసే వరి గడ్డివాముకు శుక్రవారం నిప్పంటుకుని దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పివేశారు. అప్పటికే పక్కనే ఉన్న ట్రాక్టర్‌కు మంటలు వ్యాపించి కొత భాగం కాలిపోయింది.

హామీలను అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 25,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

సీఐటీయూలో చేరిక

ఆత్మకూరు, డోన్, ఎమ్మిగనూరు, గూడూరు, ఆదోని లో పనిచేస్తున్న కొందరు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు సమక్షంలో ఆ యూనియన్‌లో చేరారు.

22న ఉగాది మహోత్సవ సమావేశం

కర్నూలు కల్చరల్: విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలకు బీక్యాంప్‌లోని టీజీ లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఉగాది మహోత్సవ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆరోగ్య భారతి ఆంధ్ర ప్రాంత కార్యదర్శి డాక్టర్ ఎండీవీఎన్ రామశర్మ తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరం తెలుగు కాలమాన పట్టిక ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రధాన ఉపన్యాసకులుగా పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు హాజరు కానున్నట్లు తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, టీటీడీ బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, శ్రీశైలం అఖిల భారతీయ కరివేన నిత్యాన్నదాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ ఎన్. వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు వెల్లడించారు.

భానుడి భగభగలు



- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- బయటకు వచ్చేందుకు జంకుతున్న ప్రజలు
- శీతల పానీయాలకు పెరిగిన డిమాండు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

గడివేముల: మార్చి నెలలోనే ఎండలు మండుతున్నాయి. రోజురోజుకు వేసవి తీవ్రత పెరుగుతోంది. నాలుగైదు రోజుల నుంచి సూర్యుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. దీంతో పగటి పూట అధిక ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. శుక్రవారం గడివేముల మండలంలో 38 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రత నమోదైంది. పాణ్యం, ఓర్వకల్లు మండలాల్లో కూడా దాదాపు అదే పరిస్థితి ఉంది. మండలంలో అధికంగా మిరప, పత్తి సాగు చేశారు. ఎండవేడి అధికంగా ఉండటంతో వ్యవసాయ కూలీలు ఉదయం నుంచి మధ్యాహ్నం సమయానికే ఇంటికి చేరుకుంటున్నా రు. మధ్యాహ్నం నుంచి సాయంత్ర వరకు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లడం లేదు. మార్చి నెలలో ఎండలు బెదరగొడుతుండటంతో ఏప్రిల్, మేలో పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. భానుడు ప్రతాపాన్ని తట్టుకునేందుకు శీతలపానీయాలతో పాటు, కొబ్బరి బొండాలు, పుచ్చకాయలను తీసుకుంటూ కొంత వరకు ఉపసమనం పొందుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో వడదెబ్బకు తగిలే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. విపరీతమైన తలనొప్పి, తల తిరగడం, జ్వరం తీవ్రంగా రావడం, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్ లేదా అపస్మారక స్థితిలోకి వెళ్లడం.. వడదెబ్బ లక్షణాలని, వెంటనే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.



గడివేములలో నిర్మానుష్యంగా మారిన నందికొట్కూరు-నంద్యాల రోడ్డు

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

- ఎండలో బయటికి వెళ్లేటప్పుడు గొడుగును తప్పక వాడాలి.
- పలుచటి కాటన్ వస్త్రాలు, తలకు టోపీ, రుమాలు ధరించాలి.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఆరుబయట అధిక శ్రమతో కూడిన పని చేయకూడదు.
- అవసరం ఉంటే తప్ప ఇంటికి నుంచి బయటకు రాకూడదు.
- మంచి నీరు, మజ్జిగ, నిమ్మరసంతో పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, శీతల పానియాలు తీసుకోవాలి.
- ఎక్కువగా నీరు, ద్రవ పదార్థాలను సేవించాలి.
- ఆల్కాహాల్‌కు దూరంగా ఉండాలి. ఆల్కాహాల్ సేవించడంతో రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. ఇది విషమ పరిస్థితికి దారితీస్తుంది.
- ఇంటిలో ఉష్ణోగ్రతను తగ్గించడానికి కిటికీలు, తలుపులకు తెరలను ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండలో పనిచేయాల్సి వచ్చినప్పుడు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి ద్రవ పదార్థాలను తీసుకోవాలి.



కలింగర పండ్లు తింటున్న ప్రజలు

వడదెబ్బకు గురైతే ఆసుపత్రికి తరలించండి



రోజురోజుకు ఎండలు అధికం కావడంతో వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వడ దెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశంలోకి చేర్చాలి. తడి గుడ్డతో శరీరాన్ని తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు అలాగే చేస్తుండాలి. చల్లని గాలి తగిలే విధంగా చూడాలి. మజ్జిగ లేదా ఓరల్ రీ హైడ్రేషన్ (ఓఆర్ఎస్) ద్రావణం తాగించాలి. వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలి. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. 65 ఏళ్ల వయస్సు పైబడిన వారు, గర్భిణులు, బాలింతలు, గుండెజబ్బు, బీపీ ఉన్నవారు అధికంగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది.

– డాక్టర్ కిరణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, గడివేముల

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నియామకం

ఓర్వకల్లు: పాణ్యం నియోజకవర్గ పరిధిలోని ఓర్వకల్లు మండల వైఎస్సార్‌సీపీ కమిటీని నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కమిటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వుల మేరకు మండల ఉపాధ్యక్షులుగా ఏ.సోమశేఖర్‌రెడ్డి, వైకే రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శులుగా కె.సాంబశివారెడ్డి, కె.మల్లికార్జునప్ప, బి.కృష్ణారెడ్డి, బోయ నాగేషులు, కార్యదర్శులుగా వై. గోపాల్ రెడ్డి, పి. రాజేష్, జి.మదన్‌మోహన్, పి. చిన్న నాగరాజు, గొల్ల వెంకటస్వామి, కోశాధికారిగా వై. జగన్ మోహన్‌రెడ్డితో పాటు మరో 25 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

యాపర్లపాడు గ్రామానికి రోడ్డు నిర్మించండి

కల్లూరు: యాపర్లపాడు గ్రామానికి రోడ్డు నిర్మించాలని సీపీఎం నాయకులు మధు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం నాయకులు గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ గ్రామంలో 500 కుటుంబాలు సుమారుగా 1,500 వరకు జనాభా నివసిస్తున్నారన్నారు. ఉలిందకొండ నుంచి నాలుగు కిలో మీటర్లు ఉన్న గ్రామానికి చేరుకోవాలంటే సుమారుగా 30 నిమిషాల సమయం పడుతుందన్నారు. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిందన్నారు. కార్యక్రమంలో రాముడు, శ్యామ్‌సన్, శివశంకర్‌రెడ్డి, గుర్నాథ్‌రెడ్డి, వెంకటేశ్వరమ్మ, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

కల్లూరు: ట్రూ అప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం నాయకుల బృందం కల్లూరు అర్బన్ ప్రాంతంలో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు యేసు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచమని అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ట్రూఅప్ చార్జీల పేరుతో పేదలపై భారం వేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు బాదుడే బాదుడు అంటూ గగ్గోలు పెట్టిన వారు అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు ఎలా పెంచుతారన్నారు. పేదలను దోచుకునే ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, కోటి మధు, వెంకటేశ్, గంగాధర్, భాస్కర్, చైతన్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

రథోత్సవం.. రమణీయం!

సి.బెళగల్: పోలకల్ గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ చెన్నసోమేశ్వర స్వామి రథోత్సవం శుక్రవారం తెల్లవారుజామున కనులపండువగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధ రాత్రి తర్వాత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత పెద్దమ్మ ఆలయం నుంచి బయలుదేరిన కుంభం కాగును భక్తులు, ఉత్సవ నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో, మేళతాళాలతో శుక్రవారం తెల్లవారుజాము 3 గంటలకు స్వామి వారి ఆలయానికి చేర్చారు. అనంతరం భారీ జన సందోహం మధ్య స్వామి వారి మహా రథోత్సవం వైభవంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. దాతల సహాయంతో ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారి పార్వేట కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో సిబ్బంది బందోబస్తు చేపట్టారు. శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, పెద్ద బావిలో స్వామివారి ఉత్సవ మూర్తుల చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

నేడు సంతానప్రాప్తి ప్రసాదం పంపిణీ..

పోలకల్ గ్రామంలో శ్రీ చెన్నసోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో ప్రత్యేకంగా చెప్పుకునే సంతాన ప్రాప్తి ప్రసాదం పంపిణీ కార్యక్రమం శనివారం ఆలయ ప్రాంగణంలో చేపడుతున్నట్లు పూజారి రమేషయ్య తెలిపారు. సంతానం లేని వారు భార్యాభర్తలు జంటగా ఉదయం 8 గంటలలోపు ఎలాంటి ఆహారం తీసుకోకుండా ఆలయానికి చేరుకుని ప్రసాదం తీసుకోవాలన్నారు.



పోలకల్‌లో వైభవంగా సాగుతున్న చెన్న సోమేశ్వర స్వామి రథోత్సవం

విజేతగా నిలిచిన గద్వాల జిల్లా వృషభాలు



బండలాగుడు పోటీల్లో పాల్గొన్న వృషభాలు

సి.బెళగల్: చెన్న సోమేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పోలకల్ గ్రామంలో శుక్రవారం పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీల్లో అలంపూర్ గద్వాల జిల్లా వృషభాలు విజేతగా నిలిచాయి. పలు ప్రాంతాల నుంచి 18 జతలు ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో అలంపూరు గద్వాల జిల్లా సాతర్ల గ్రామానికి చెందిన రైతు అబ్దుల్‌బాషా ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.40 వేలు, నంద్యాల జిల్లా పెద్ద కొట్టాల గ్రామ రైతు బోరెడ్డి నారాయణరెడ్డి ఎద్దులు రెండవ స్థానంలో నిలిచి రూ.30 వేలు, గద్వాల జిల్లా కంచుపాడు గ్రామానికి చెందిన ఆంజనేయరెడ్డి ఎద్దుల మూడవ స్థానంలో నిలిచి రూ.20 వేలు బహుమతిని అందుకున్నాయి. శనివారం న్యూకేటగిరి బండసైజు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. పోటీలకు వాఖ్యాతలుగా వేమారెడ్డి, సాయి వ్యవహరించారు.



కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు

గుంతలు బాబోయ్ !

కర్నూలు –గుంటూరు రహదారిలో వాహనదారులను గుంతలు భయపెడుతున్నాయి. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడాల్సిందే. గార్గేయపురం గ్రామ సమీపంలోని జీరుబండలు వద్ద రహదారిపై అడుగు మేర గుంతలు పడ్డాయి. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిపై వెళ్తున్నాయి. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

– కర్నూలు(రూరల్)

శ్రీచైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో కర్నూలు భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శుక్రవారం శ్రీ చైతన్య మహాప్రభు 539వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే గౌర పూర్ణిమ వేడుకలను పురస్కరించుకొని తెల్లవారు జామున 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరి నామ జపం, గౌర హారతి, మహా శంఖాభిషేకం, 108 రాజ భోగ నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు గౌర లీలపై సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులు

ఘనంగా హోలీ వేడుకలు





సుగాలిమెట్టలో రంగులు చల్లుకుంటున్న దృశ్యం, కోడుమూరులో చిన్నారుల సందడి

పాణ్యం/కోడుమూరు రూరల్: ఊరూరా హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం పాణ్యం మండలంలోని సుగాలిమెట్ట, కేఆర్ఆర్ తండా గ్రామాల్లో ఒకరిపై ఒకరు రంగులు చట్టుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. వీధుల వెంట రంగులు నీళ్లు చల్లుతూ ఉత్సాహంగా హోలిని జరుపుకున్నారు. అలాగే కోడుమూరులోని మెయిన్‌బజార్‌లో ఉదయాన్నే ప్రజలు కామదహనం గావించి వేడుకలను మొదలు పెట్టారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రజలు రంగులు కలిపిన నీళ్లను, రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కోడుమూరు, గూడూరుతో పాటు, గ్రామాల్లోనూ ప్రజలు హోలీ సంబరాలను జరుపుకోవడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది.

12న వీర హనుమాన్ శోభాయాత్ర

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12న వీర హనుమాన్ విజయ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలోపాసన దివస్ పురస్కరించుకొని హిందువులను సంఘటితం చేసేందుకు హనుమాన్ శోభాయాత్ర ఒక సువర్ణ అవకాశం అన్నారు. శోభాయాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి, వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత విశేష సంపర్క ప్రముఖ్ ప్రతాప్‌రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేష్, జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వామివార్లను దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు



పోటెత్తిన భక్తులు

గడివేముల: ఒండుట్ల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీరంగనాయక, రంగల్ దర్వేశ్‌ఖాద్రీ ఆలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. కులమతాలకు అతీతంగా జరుగుతున్న తిరునాలకు మండలంలోని భక్తులతో పాటు జిల్లాలలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ సమేత రంగనాయక స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు నర్శయ్యస్వామి ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివార్లకు పల్లకీ సేవ చేపట్టారు. ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరునాలకు వచ్చిన భక్తులు ఆర్యవైశ్య సత్రంతో పాటు గ్రీన్‌కో ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

ట్రేడ్ లైసెన్సు బకాయిలపై కొరడా

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో వ్యాపారాలు చేసుకొంటూ ట్రేడ్ లైసెన్సులు చెల్లించని వారిపై శుక్రవారం పారిశుద్ధ్య అధికారులు, సిబ్బంది కొరడా ఝళిపించారు. స్థానికంగా కొత్త బస్టాండ్ ప్రాంగణంలో మొండి బకాయిలు, ట్రేడ్ లైసెన్సులు చెల్లించని షాపుల వద్ద మున్సిపల్ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. పన్నులు చెల్లించాలంటూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. మొండి బకాయిలు ఉన్న షాపులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి నెలాఖరులోపు ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున షాపుల యజమానులు బకాయిలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో షాపులను సీజ్ చేయడంతో పాటు వారి ట్రేడ్ లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. పారిశుద్ధ్య తనిఖీదారుడు యువరాజ్ పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): కంటిచూపును పోగొట్టే గ్లకోమా వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ కంటి వైద్యులు డాక్టర్ పి.సుధాకర్‌రావు చెప్పారు. గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక బుధవార పేటలోని సుశీల నేత్రాలయలో పారామెడికల్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.సుధాకర్‌రావు మాట్లాడుతూ 40 ఏళ్లు పైబడి వారు తరచూ అద్దాలు మార్చాల్సి రావడం, మసక వెలుతురులో వస్తువులను గుర్తించడం ఆలస్యం అవడం, క్షేత్రదృష్టిని క్రమేణా కోల్పోవడం, దృష్టి మందగించడం, వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే చూపు పోకుండా కాపాడుకోవచ్చన్నారు డాక్టర్ సావిత్రి, డాక్టర్ నేహా పాల్గొన్నారు

సంస్కృత అధ్యయన కేంద్రం ప్రారంభం

కర్నూలు కల్చరల్: న్యూఢిల్లీ కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళా శాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆ కళాశాలలో సంస్కృత అధ్యయన కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్కృత భారతి జిల్లా అధ్యక్షురాలు మహాలక్ష్మి, నేషనల్ సంస్కృత యూనివర్సిటీ ఆచార్యులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అన్ని భాషలకు జనని అయిన సంస్కృత భాషను అందరూ నేర్చుకోవాలనే సదుద్దేశంతో కేంద్రియ సంస్కృత విశ్వవిద్యాలయం సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించిందన్నారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సాయంత్రం 4 గంటల నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 90195 56184ను సంప్రదించాలన్నారు. సంస్కృత భారతి నగర అధ్యక్షుడు గుబ్బా బాలస్వామి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఒక బూటకం

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో షెడ్యూల్డు కులాల వర్గీకరణ ఒక బూటకమని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాల సంఘాల జేఏసీ చైర్మన్ కాసారపు వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా యూనిట్‌గా వర్గీకరణ ఎలా సాధ్యమవుతుందో కూటమి ప్రభుత్వంలోని నేతలు చెప్పాలన్నారు. వర్గీకరణకు సంబంధించి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటులో ఎస్సీ, ఎస్టీలు కానివారికి చోటు కల్పించడం శోచనీయమన్నారు. దళిత కాలనీల్లో ఉన్న సమస్యలు దళితులకు మాత్రమే తెలుస్తాయని, మిగిలిన కులాల వారికి ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో మాలలు, ఉపకులాలు 12 శాతం పైనే ఉన్నారని, ప్రతి కులానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అఖిల భారత మాల సంఘాల ముఖ్య నాయకులు రాహుల్, కిరణ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం



లభ్యమైన మృతదేహం

కర్నూలు: కేసీ కెనాల్‌లో కొట్టుకుపోతున్న గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి ప్రభుత్వాసుపత్రి మార్చురీ కేంద్రంలో భద్రపరిచారు. శుక్రవారం మధ్యాహ్నం కర్నూలు వైపు నుంచి నీటిలో కిందివైపు కొట్టుకుపోతుండగా జొహరాపురం బ్రిడ్జి వద్ద స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఒకటో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని నీటిలో నుంచి బయటికి తీసి మార్చురీకి తరలించారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉండొచ్చని, లేత పసుపు రంగు ఫుల్ షర్టు ధరించి ఉన్నాడని, నడుముకు ఎర్రటి మొలతాడు ఉందని పోలీసులు తెలిపారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేవు. మృతుడి ఆధారాలు ఏమీ లభించకపోవడంతో పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారమివ్వాలని సీఐ రామయ్య నాయుడు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా వేణుగోపాల స్వామి రథోత్సవం



వేణుగోపాల స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు(రూరల్): నందనపల్లె గ్రామ సమీపంలో వెలసిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి రథోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. యాగశాలలో హోమం, బలిహరణ పూజలు చేపట్టారు. అనంతరం పుష్పాలతో అలంకరించిన రథంపై స్వామి, అమ్మవార్లను ఉంచి మేళతాళాల నడుమ స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.